టమాటా కిలో రూ.120



ఆత్మకూరు, న్యూస్‌టుడే : టమాటా ధర వినియోగదారులను బెంబేలెత్తిస్తోంది. గతంలో అన్ని కూరగాయల ధరలకు రెక్కలొచ్చినా టమాటా ధర మాత్రం వినియోగదారుడికి కాస్తా ఊరటనిచ్చే విధంగా ఉండేది. ప్రస్తుతం ఇందుకు భిన్నంగా ధర పలుకుతోంది. ఆత్మకూరులో కిలో రూ.120కి చేరింది. కర్నూల్, గద్వాల, శంషాబాద్ కూరగాయల మార్కెట్లలో కిలో రూ.వంద కొనసాగుతున్న పరిస్థితుల్లో రవాణా ఖర్చులను పరిగణలోకి తీసుకుని కిలో రూ.120 విక్రయించాల్సిన పరిస్థితి ఉందని స్థానిక కూరగాయల వ్యాపారులు చెబుతున్నారు.

చంద్రఘంటాదేవిగా జోగులాంబ

అలంపూర్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా అలంపూర్ ఆలయాల దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. స్వామి వారికి అభిషేకం, సర్వదర్శనం, జోగులాంబకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో వివిధ రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఉంచి ఆలయ ప్రదక్షిణ చేయించారు. మూడోరోజు జోగులాంబ భక్తులకు చంద్రఘంటాదేవి అలంకరణలో దర్శన భాగ్యం కల్పించారు.



అలంకరణలో జోగులాంబ

విద్యార్థులకు మళ్లీ రాగి జావ

కార్యక్రమాన్ని తిరిగి అమలు చేసేలా ఉత్తర్వులు



రాగిజావ తాగుతున్న విద్యార్థులు(పాతచిత్రం)

గద్వాల న్యూటౌన్, న్యూస్‌టుడే: ఉదయం వేళ విద్యార్థుల ఆకలి తీర్చేందుకు, పోషక విలువలతో కూడిన ఆహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పాఠశాలల్లో రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని గత విద్యా సంవత్సరం ప్రారంభించింది. ఈ విద్యా సంవత్సరం జూన్ మాసం వరకు ఈ కార్యక్రమం కొనసాగగా, మూడు నెలలుగా ఆగిపోయింది. రాగి జావ అందించడం వల్ల మంచి ఫలితాలున్నాయని భావించిన ప్రభుత్వం ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేయాలని నిర్ణయించింది. తాజాగా పీఎం పోషణ్ పథకంలో భాగంగా సర్కారు పాఠశాలల్లోనూ తిరిగి ప్రారంభించాలని ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. దీంతో దసరా సెలవుల అనంతరం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జావ అందనుంది.

వారంలో మూడు రోజులు: ఉమ్మడి జిల్లాలో మొత్తం 3,227 ప్రభుత్వ పాఠశాలలుంటే 1 నుంచి 10వ తరగతి వరకు మూడు లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ ప్రతి రోజూ మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. వీటితో పాటు ఉదయం వేళ వంట ఏజెన్సీల ద్వారా రాగిజావ కూడా అందించనున్నారు. దీంతో ఉదయం వేళ ఆహారం తీసుకోకుండా వచ్చే విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల రాగి పిండి, బెల్లంతో కలిపి మరగబెట్టిన జావను వారంలో మూడు రోజుల పాటు అందించనున్నారు. ఇదిలా ఉండగా గతేడాది రాగి జావ పథకం విద్యార్థులకు పూర్తి స్థాయిలో అందలేదు. శ్రమకు తగిన ఫలితం లేదంటూ వంట ఏజెన్సీలు మొరాయించడం, పిండి, బెల్లం సరఫరా చేయడంలో జాప్యం జరగడంతో కొన్ని చోట్ల తరచూ జావ అందించడంలో అంతరాయం ఏర్పడేది. అలాంటి ఇబ్బందులను అధిగమించి విద్యార్థులకు నిరంతరాయంగా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
మహబూబ్‌నగర్	859	61,656
నాగర్‌కర్నూల్	848	71,689
వనపర్తి	537	42,841
నారాయణపేట	511	59,870
జోగులాంబ	472	65,635

ఆదేశాల ప్రకారం అమలు : రాగి జావ అందించాలని ఆదేశాలు వచ్చాయి. ప్రభుత్వం నుంచి అవసరమైన పిండి, బెల్లం సరఫరా కాగానే పాఠశాలలకు చేరవేసి, అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం. రాగి జావ విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం. ఫలితంగా వారిలో చురుకుదనం పెరుగుతుంది.

-రవీందర్, డీఈవో, గద్వాల

పొలాల్లో కాసుల పంట

నిబంధనలకు విరుద్ధంగా స్థిరాస్తి వ్యాపారం



గోపాల్‌పేట మండలంలో వ్యవసాయ భూమిని ప్లాట్లుగా మార్చిన వైనం

వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని ఓ గ్రామంలో ఒక గుంట స్థలానికి కూడా రిజిస్ట్రేషన్లు చేశారు. ఇక్కడ స్థిరాస్తి వ్యాపారానికి ఓ వ్యక్తి వ్యవసాయ భూమి కొనుగోలు చేశారు. నాలా(వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చే చట్టం) మార్చుకోకుండానే కడీలు పాతి ప్లాట్లుగా వేశారు. ఇది నిబంధనలకు విరుద్ధం. అయినా గుంటల చొప్పున ఆ వెంచరు నిర్వాహకులు రెవెన్యూ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. ఇలా పలువురికి ప్లాట్లను నిబంధనలకు విరుద్ధంగా విక్రయించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఈ మండలంలో వ్యవసాయ భూములకు ప్లాట్లుగా మార్చి గుంటల్లో రిజిస్ట్రేషన్ చేసిన ఘటనలు పదుల సంఖ్యలో ఉన్నాయి.

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని ఓ గ్రామంలో 60 ఎకరాల్లో పెద్ద వెంచరు వేశారు. దీనిని నాలాగా మార్చలేదు. అయినా 121 చదరపు గజాల చొప్పున ప్లాట్లుగా మార్చి విక్రయానికి పెట్టారు. స్లాటు బుకింగ్ చేసుకుని ఒక్కొక్కరికి గుంట చొప్పున రిజిస్ట్రేషన్ చేశారు. వీరికి పట్టా పాసుపుస్తకాలూ వచ్చాయి. వాస్తవానికి ఇక్కడ వెంచరుగా అభివృద్ధి చేసిన నిర్వాహకులు వ్యవసాయ భూమిగా చూపించి రిజిస్ట్రేషన్ చేశారు.

ఈనాడు, మహబూబ్‌నగర్-న్యూస్‌టుడే, వనపర్తి వ్యవసాయం: ఉమ్మడి జిల్లాలో పలు వ్యవసాయ భూములు వెంచర్లుగా మారుతున్నాయి. నాలాకు మార్చుకోకుండానే ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. డీటీసీపీ నుంచి అనుమతులు కూడా ఉండవు. స్థిరాస్తి వ్యాపారులు మాత్రం వ్యవసాయ భూములకు లేఅవుట్లు చేసి విక్రయిస్తున్నారు. సాధారణంగా వ్యవసాయేతర భూములకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయాలి. వ్యవసాయ భూములకు నాలా ధ్రువపత్రం లేకుంటే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయడం కుదరదు. ఈ భూములకు రెవెన్యూ కార్యాలయాల్లోనే ప్లాట్ల రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. సాంకేతికంగా ఇబ్బందులు తలెత్తకుండా గుంటల్లో వీటికి రిజిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.

కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత..

పాలమూరులో కొత్త జిల్లాలు ఏర్పాటైన తర్వాత భూముల ధరలకు రెక్కలొచ్చాయి. జిల్లా కేంద్రాల సమీపంలో వ్యవసాయ భూములు వెంచర్లుగా మారాయి. హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై ఉన్న బాలానగర్, రాజాపూర్, జడ్చర్ల, భూత్పూరు, మూసాపేట, అడ్డాకుల, కొత్తకోట, పెబ్బేరు, ఎర్రవల్లి, ఇటిక్యాల, మానవపాడు, ఉండవల్లి మండలాల్లో పలుచోట్ల వ్యవసాయ భూములు వెంచర్లుగా మారాయి. కల్వకుర్తి నుంచి రాయచూరుకు వెళ్లే జాతీయ రహదారిలోని కల్వకుర్తి, మిడ్జిల్, మహబూబ్‌నగర్ అర్బన్, మహబూనగర్ గ్రామీణం, దేవరకద్ర, మరికల్, మక్తల్, మాగనూరు, కృష్ణా మండలాల్లోనూ వ్యవసాయ భూముల్లో పాట్లు వెలిశాయి. చాలాచోట్ల వీటిని వ్యవసాయేతర భూములుగా మార్చుకోవడం లేదు. గుంటల పేరుతో యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లను చేస్తున్నారు.

నిబంధనలు చెబుతున్నా..

వ్యవసాయ భూములకు గుంట నుంచి 10 గుంటల మధ్య స్లాటు బుక్ చేసి రిజిస్ట్రేషన్లకు రెవెన్యూ కార్యాలయాలకు వస్తే దీనిపై విచారణ జరిపించాలి. తండ్రి లేదా తల్లికి ఎకరా స్థలం ఉండి వారికి ఎక్కువ మంది సంతానం ఉంటే (కుటుంబ సభ్యులకు) మాత్రం రిజిస్ట్రేషన్లు చేయవచ్చు. సంబంధం లేని వ్యక్తులు నిత్యం వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు స్లాటు బుక్ చేస్తే తహసీల్దార్‌కు అనుమానం రావాలి. ఈ సర్వే నంబరులో క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలి. అక్కడ స్థిరాస్తి వ్యాపారాలు చేస్తున్నారా విచారణ చేయాలి. చాలాచోట్ల ఇవేమీ చేయడం లేదు. స్థిరాస్తి వ్యాపారమని తెలిసి కూడా వ్యవసాయ భూములకు గుంటల్లో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఎకరాకు 40 గుంటలు ఉంటుంది.. ఒక గుంటకు 121 చదరపు గజాలు ఉంటాయి. ఇలా గుంటల్లో పాట్లుగా చేసి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. దీనిపై మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్(రెవెన్యూ) మోహన్‌రావు మాట్లాడుతూ వ్యవసాయ భూములను కుటుంబసభ్యులకు మినహాయించి ఇతరుల పేరు మీద ఐదు గుంటల వరకు ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయకూడదు. ఇతరుల పేరు మీద స్లాటు బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ల కోసం వస్తే తహసీల్దారు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.




ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

ధ్రువపత్రాల పరిశీలన పూర్తి

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : డీఎస్సీ- 2024 ఫలితాల్లో ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ముగిసింది. వనపర్తిలోని బాలికల ఉన్నత పాఠశాలలో తొమ్మిది పరిశీలన కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతి కేంద్రాల్లో ఇద్దరు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఇద్దరు ఉపాధ్యాయుల చేత నాలుగు రోజుల పాటు పరిశీలన కొనసాగింది. మొత్తం 152 ఉద్యోగాలకు 363 మందిని పరిశీలనకు పిలవగా 341 మంది హాజరయ్యారు. శనివారం 53 మంది అభ్యర్థుల పత్రాలను పరిశీలించారు. మొత్తం 341 మంది పత్రాలను పరిశీలన చేయగా అందులో ఎస్జీటీ 149, స్కూల్ అసిస్టెంట్లు 136, భాషా పండితులు 23, పీఈటీలు 17, ఎస్ఏ ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ 12, పీడీలు నలుగురు ఉన్నారు. పత్రాల పరిశీలన ప్రశాంతంగా ముగిసిందని జిల్లా విద్యాధికారి గోవిందరాజులు తెలిపారు.

జిల్లాలో పోలీస్ చట్టం అమలు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఈ నెల 31వ తేదీ వరకు పోలీస్ యాక్టు 30 అమలులో ఉంటుందని ఎస్పీ గిరిధర్ రావుల తెలిపారు. అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రజాధనానికి నష్టం కలిగించే చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేపట్టరాదన్నారు. సభలు, సమావేశాలు, ధర్నాలు, నిసరనలు చేసేందుకు ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు.



ఆకుపచ్చని పర్వత శిఖరాలు

ప్రకృతి సోయగం.. ముగ్ధ మనోహరం

వనపర్తికి సమీపంలో తిరుమలయ్య గుట్టపై తిరుమలనాథుడు కొలువై ఉన్నాడు. గుట్టపై నుంచి చూస్తే ఆకుపచ్చని పర్వత శిఖరాలు కనువిందు చేస్తుంటాయి. ఆహ్లాదకర వాతావరణం.. ప్రకృతి చూపరులను కట్టిపడేస్తుంది. కృష్ణానది పరివాహక ప్రాంతం, పానగల్ కోట, పాము ఆకారంలో ఒంపులు తిరిగిన రహదారి మార్గం.. ఇలా ఎన్నో మనోహర దృశ్యాలు మైమరిసిస్తాయి.

- న్యూస్‌టుడే, వనపర్తి పట్టణం

అధికారులు వారధులుగా పని చేయాలి



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: అధికారులు ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా పని చేయాలని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో, ఎంపీవోలతో ప్రభుత్వ పథకాల అమలుపై సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాల అమలు గురించి అధికారులతో అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రాయితీ సిలిండర్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గృహజ్యోతి పథకంలో భాగంగా జీరో విద్యుత్తు బిల్లు ప్రతి వినియోగదారుడికి అమలయ్యేలా ఎంపీడీవోలు దృష్టి సారించాలన్నారు. జడ్పీ, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఈఈ మల్లయ్య, డీఈ శ్రీనివాస్‌కు ఆదేశించారు.

7.954 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల జలాశయానికి 55 వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా విద్యుదుత్పత్తికి 38,621 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 3.878, దిగువన ఆరు యూనిట్ల ద్వారా 4.076 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగింది. ఒకే రోజు 7.954 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత వర్షాకాలం ఎగువన 233.464, దిగువన 201.070 మిలియన్ యూనిట్లకు చేరినట్లు జెన్‌కో ఎస్ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

వ్యాధుల వ్యాప్తిపై ఆరా



వైద్యులతో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్యవిద్య అదనపు డైరెక్టర్ శివరామ్ ప్రసాద్

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాలో సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై రాష్ట్ర వైద్యవిద్య అదనపు డైరెక్టర్ శివరామ్ ప్రసాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రాలను శనివారం సందర్శించి ఆరా తీశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, సీజనల్ వ్యాధుల వ్యాప్తిలో నమోదైన కేసుల వివరాలను పరిశీలించారు. జనరల్ ఆసుపత్రి పరిసరాలను సందర్శించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్‌సీహెచ్‌లో వైద్యులతో సమావేశం నిర్వహించారు. మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఎక్కువగా సాధారణ ప్రసవాలు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఎమ్‌సీహెచ్ ఆసుప్రతిలో ఐదు పడకలతో న్యూట్రిషన్ రీహాబిలిటేషన్ (పోష్టికాహార పునరావస) కేంద్రాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. పోష్టికాహార లోపం, ఐరన్ లోపంతో పుట్టిన పిల్లలకు ప్రత్యేక చికిత్స అందివచ్చని తెలిపారు. సమావేశంలో ఆర్ఎమ్‌వో జావీద్ హుసేన్, గైనకాలజిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్మయి, ప్రొఫెసర్ చంద్రమోహన్ పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వసతులు కల్పిస్తాం



మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు రియాజ్

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని గ్రంథాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రియాజ్ పేర్కొన్నారు. శనివారం వనపర్తిలోని సురవరం ప్రతాపరెడ్డి స్మారక జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గ్రంథాలయానికి వచ్చిన నిరుద్యోగులతో మాట్లాడారు. తెలంగాణలో దాదాపు 600 గ్రంథాలయాలున్నాయని రానున్న రోజుల్లో వాటి సంఖ్య వెయ్యికి పెంచేందుకు కృషి చేస్తానన్నారు. హాజరు రిజిస్టర్‌తో పాటు సలహాలు, సూచనల కోసం ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ గ్రంథాలయాలకు వచ్చే నిరుద్యోగులకు వనపర్తిలో, మహబూబ్‌నగర్, నారాయణపేటకు చెందిన నిరుద్యోగులకు మహబూబ్‌నగర్ గ్రంథాలయంలో పోటీ పరీక్షల సన్నద్ధంపై దసరా పండగ అనంతరం ఒక రోజు శిక్షణ ఇప్పిస్తాయని తెలిపారు. వనపర్తిలో సరిపడా మూత్రశాలలు నిర్మించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి మనోజ్‌కుమార్, వికారాబాద్ కార్యదర్శి సురేశ్ కుమార్, జిల్లా గ్రంథాలయ నూతన ఛైర్మన్ గోవర్ధన్, లైబ్రరియన్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో తక్షణ ప్రవేశాలు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : వనపర్తి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగిలిపోయిన సీట్లకు తక్షణ ప్రవేశాలకు అవకాశం కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపల్ రమేశ్‌బాబు తెలిపారు. ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో ముందే దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. ఈ సంవత్సరం ఆరు కొత్త కోర్సులు ప్రవేశపెట్టామని తెలిపారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : దళితులు, బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతికి కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి కృషి చేశారని ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు. వనపర్తి కలెక్టరేట్‌లో శనివారం కేంద్రమాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ ఆదర్శ్‌సురభి, అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల కష్టాలు తీరేనా?



పెబ్బేరులో గతేడాది యాసంగిలో టార్పాలిన్ లేక అకాల వర్షానికి తడిచిన ధాన్యం

పెబ్బేరు, న్యూస్‌టుడె : ఉమ్మడి జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. గత ఏడాది కేంద్రాలకు టార్పాలిన్లను అందించకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిచి రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతుల సమస్యలు, వారి ఇబ్బందులను ఎలా అధిగమించాలనే విషయంపై ప్రస్తుతం అధికారుల్లో స్పష్టత కనిపించడం లేదు. కేవలం ఎన్ని మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వస్తుంది.. కొనుగోలు కేంద్రాలు ఎన్ని ఏర్పాటు చేయాలి.. సన్న రకాలను గుర్తించేందుకు సూక్ష్మ మీటర్ ఉపయోగించడం వాటిపైనే దృష్టి సారించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా ఆధ్వర్యంలో 827 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు సిద్ధం చేశారు.

వీటిపై దృష్టి సారించండి..

● గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు స్థల సమస్య వేధిస్తోంది. అరకొరగా ఉన్న స్థలంలో ధాన్యం ఆరబోసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రహదారులపై ధాన్యం ఆరబోయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి.● గతంలో ధాన్యం తడిచిపోకుండా టార్పాలిన్లను కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అందించడం లేదు. వీటిని మార్కెటింగ్ అధికారులు కేంద్రాలకు సరఫరా చేయడం లేదు.

● గోనె సంచులు, లారీల సమస్య ఏటా వేధిస్తోంది. ధాన్యం కొనుగోళ్లకు సంచుల కొరత లేదంటూనే క్షేత్రస్థాయిలో మాత్రం రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. సంచులు లేవనే నెపంతో వారంలో ఓరోజు కొనుగోళ్లను నిలిపి వేస్తున్నారు. లారీల కొరత కారణంగా కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను తరలించకపోవడంతో వర్షాలకు తడుస్తున్నాయి. తడిచిన ధాన్యం మిల్లర్లు తిరస్కరించిన సంఘటనలు ఉన్నాయి.

● కొనుగోలు కేంద్రాల్లో జీవో ప్రకారం అయిదు మంది సిబ్బంది ఉండాలి. కేవలం ఒకరిద్దరితో కొనుగోళ్లు చేస్తుండటంతో ఆలస్యం జరుగుతోంది. కొన్ని చోట్ల బస్తాలు భారీగా చోరీకి గురవుతున్నాయి. గతేడాదిలో వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలో జడ్చర్లకు చెందిన వ్యక్తులు వీటిని చోరీ చేసి బాదేపల్లి మార్కెట్ యార్డులో విక్రయించినట్లు పెబ్బేరు పోలీసుల విచారణలో తేలింది. ● వనపర్తి జిలాలోనే 700 బస్తాలకు పైగా చోరీ అయ్యాయి. ఇలాంటి చోరీ సంఘటనలు చాలా ఉన్నాయి. కేంద్రాల నిర్వాహకులు ధాన్యానికి భద్రత కల్పించలేక పోతున్నారు. నష్టాలన్నీ రైతులే భరిస్తున్నారు.

జిల్లా	దిగుబడి అంచనా (మెట్రిక్‌టన్నుల్లో)	కొనుగోలు కేంద్రాలు
వనపర్తి	4 లక్షలు	244
నాగర్‌కర్నూల్	2.18 "	244
నారాయణపేట	3.52 "	95
గద్వాల	లక్ష	55
మహబూబ్‌నగర్	1.99 లక్షలు	189

ఇబ్బందులు కాకుండా చర్యలు

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. వనపర్తి జిల్లాలో 3,500 టార్పాలిన్లు అవసరం ఉన్నాయని, వాటిని కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేయాలని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిని కోరాం. లారీల కొరత లేకుండా జిల్లాలో 7 సెక్టార్లను ఏర్పాటు చేసి ఒక్కో సెక్టారుకు 40 చొప్పున 280 లారీలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం 25 లక్షల గోనె సంచులు ఉన్నాయి. ఇంకా 75 లక్షల సంచులకు పైగా అవసరం ఉంది. వాటిని తెప్పిస్తున్నాం. ధాన్యం చోరీ కాకుండా కేంద్రాల వద్ద గస్తీకి పోలీసులను కేటాయించాలని ఎస్పీని కోరాం.

-ఇర్ఫాన్, పౌరసరఫరాల సంస్థ డీఎం, వనపర్తి

రెజ్లింగ్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం


మహబూబ్‌నగర్ జట్టుకు బహుమతిని అందజేస్తున్న డీవైఎస్‌వో వెంకటేశ్ గుప్తా, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు తదితరులు

ధన్వాడ, న్యూస్‌టుడే: క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని నారాయణపేట డీవైఎస్‌వో వెంకటేశ్ గుప్తా అన్నారు. నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో రెండు రోజులుగా కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ బాలికల రెజ్లింగ్ పోటీలు శనివారం ముగిశాయి. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు మాటాడారు. అనంతరం విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. అండర్ 14 విభాగంలో 30 కిలోలకు సంబంధించి నందిని (మహబూబ్‌నగర్), 33 కిలోల విభాగంలో నిఖిత (మహబూబ్‌నగర్), 36 కిలోల విభాగంలో సీతామహలక్ష్మి (మహబూబ్‌నగర్) ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. 39 కిలోల విభాగంలో శిరీష (మహబూబ్‌నగర్), 42 కిలోల విభాగంలో ప్రియమణి (మహబూబ్‌నగర్), 46 కిలోల విభాగంలో మౌనిక (మహబూబ్‌నగర్), 62 కిలోల విభాగంలో నైతిక (ఆదిలాబాద్), కీర్తి (మహబూబ్‌నగర్) ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. 69 కిలోల విభాగంలో శివరంజని (మహబూబ్‌నగర్), శ్రుతి (కరీంనగర్), 73 కిలోల విభాగంలో సింధు (నిజామాబాద్), సపూరాలు (మహబూబ్‌నగర్) ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. 50 కిలోల విభాగంలో రజిత (మహబూబ్‌నగర్), అక్షయ (మెదక్), మొదటి స్థానం సాధించిన వారు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

అండర్-19 క్రికెట్ పోటీల రన్నర్స్‌గా పాలమూరు


రన్నరప్ ట్రోఫీతో జిల్లా క్రికెటర్లు, ఎండీసీఏ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) నిర్వహించిన అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు రన్నర్‌గా నిలిచింది. ఫైనల్స్‌లో కరీంనగర్ చేతిలో 2 వికెట్ల తేడాతో ఓడి రెండో స్థానం దక్కించుకుంది. శనివారం వరంగల్‌లోని చెంగిచర్ల మైదానంలో నిర్వహించిన తుది పోరులో మొదట బ్యాటింగ్‌కు దిగిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. షాదాబ్ అహ్మద్ 89 (99 బంతుల్లో 4×11, 6×3), అబ్దుల్ రాఫె 48, అంకిత్ రాయ్ 31 పరుగులు చేశారు. అనంతరం కరీంనగర్ జట్టు 49.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 241 పరుగులు చేసి విజయం సాధించింది. జిల్లా జట్టు నుంచి ముఖీత్ 3, షాదాబ్ 2, శశాంక్ 1 వికెట్ తీశారు. రన్నర్స్‌గా నిలిచిన పాలమూరు జట్టుకు వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి శ్రీనివాస్, మహబూబ్‌నగర్ క్రికెట్ సంఘం కార్యదర్శి ఎం.రాజశేఖర్‌లు ట్రోఫీ బహూకరించారు. కార్యక్రమంలో క్రికెట్ సంఘం ప్రతినిధులు ఉదయ్ భాను రావు, ప్రవీణ్, అబ్దుల్లా, శివశంకర్ తదితరులు హాజరయ్యారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు


విజేత మహబూబ్‌నగర్ జట్టుతో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వార్ల విజయ్‌కుమార్, ఎస్‌జీఎఫ్ నిర్వాహకులు తదితరులు

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రీడా సామర్థ్యం పెంచుకోవడంతో ఉపాధితో పాటు దేశ కీర్తి ప్రతిష్ఠలు పెంపొందించవచ్చని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వార్ల విజయ్‌కుమార్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు కోస్గిలో మూడు రోజుల పాటు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం బాలికల విభాగంలో ఆదిలాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, బాలుర విభాగంలో మహబూబ్‌నగర్, కరీంనగర్, వరంగల్ జట్లు తొలి మూడు స్థానాల్లో నిలిచాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పురపాలిక ఛైర్‌పర్సన్ కోడిగంటి అన్నపూర్ణ తదితరులున్నారు.

చుట్టేద్దాం.. చూసొద్దాం

- తెలంగాణ దర్శినికి సర్కారు శ్రీకారం
- 3వేల మంది పాలమూరు విద్యార్థులకు అవకాశం

అచ్చంపేట, న్యూస్‌టుడే : ఉరిమే ఉత్సాహం.. కొత్త ప్రాంతాలు పర్యటించాలన్న ఆసక్తి మెండుగా ఉన్న విద్యార్థులకు శుభవార్త. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల స్థాయి విద్యార్థులకు పర్యాటక, చారిత్రక ప్రాంతాలపై అవగాహన కల్పించేందుకు నిర్ణయించింది. 'తెలంగాణ దర్శిని' శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పాఠశాల స్థాయిలో రెండో తరగతి నుంచి డిగ్రీ విద్యార్థుల వరకు వివిధ పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు ప్రభుత్వం రూ. 12.10 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల విద్యార్థులు ఈ పథకం కింద చారిత్రక, పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చు.

ఉమ్మడి జిల్లాకు రూ. 36 లక్షలు..

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది విద్యార్థులు పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాల వారీగా విద్యార్థుల సంఖ్య, నిధులను త్వరలో ఖరారు చేయనున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో సుమారు 3 వేల మంది విద్యార్థులు పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు రూ. 36 లక్షలు కేటాయించే అవకాశం ఉంది.

దసరా తర్వాత..

విద్యార్థులను విహార యాత్రకు తీసుకెళ్లి వారికి అవగాహన కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఎకో టూరిజం, ఆర్ట్, క్రాఫ్ట్, వారసత్వం, సాంస్కృతిక, చారిత్రక, శాస్త్రీయ ప్రాముఖ్యత ఉన్న ప్రదేశాలను సందర్శించేలా ప్రణాళికలు రూపొందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దసరా సెలవుల తరువాత ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.


క్షేత్ర పర్యటనలో ఉమామహేశ్వరం క్షేత్రం వద్ద విద్యార్థులు

తరగతుల వారీగా వివరాలు

విభాగం	తరగతులు	రోజులు	దూరం (కి.మీ.లలో)	ఒక్కో విద్యార్థికి ఖర్చు (రూ.లలో)
ఒకటి	2-4	ఒక రోజు	స్థానికం (మండల పరిధి)	300
రెండు	5-8	ఒక రోజు	20-30	800
మూడు	9-ఇంటర్	రెండు రోజులు	50-70	2,000
నాలుగు	డిగ్రీ	నాలుగు రోజులు	రాష్ట్రం	4,000

తరగతుల వారీగా విభాగాలు

విద్యార్థులు చదువుతున్న తరగతులను పరిగణనలోకి తీసుకొని నాలుగు విభాగాలుగా విభజించారు. మొదటి విభాగంలో 2-4 తరగతుల విద్యార్థులను గ్రామం లేదా మండల పరిధిలోని స్మారక చిహ్నాలు, వారసత్వ ప్రదేశాలు, ఉద్యానాలను సందర్శించేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలి. రెండో విభాగంలో 5-8 తరగతుల విద్యార్థులు 20 కిలోమీటర్ల నుంచి 30 కి.మీ. పరిధిలోని ప్రదేశాలను సందర్శించేందుకు అవకాశం కల్పించారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులు 50-70 కి.మీ. పరిధిలో ఉన్న ప్రదేశాలను రెండు రోజుల పాటు సందర్శించవచ్చు. డిగ్రీ విద్యార్థులు నాలుగు రోజుల పాటు పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు ప్రణాళికలు రూపొందించారు. సొంత జిల్లా వెలుపల లేదా రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోనైనా పర్యటించి పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు అవకాశం కల్పించారు.

వారసత్వ సంపద కాపాడుకుందాం..

తెలంగాణ దర్శిని కార్యక్రమం విద్యార్థులకు ప్రత్యేక అవకాశం కల్పించనుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోనున్నారు. వారసత్వ సంపదను కాపాడుకోవడంలో భాగస్వాములు అయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలోని విద్యార్థుల పర్యాటక ప్రదేశాల సందర్శనకు ప్రణాళికలు రూపొందించి అమలు చేయనున్నాం.

-డా.గోవిందరాజులు, డీఈవో, నాగర్‌కర్నూలు

రామ రామ ఉయ్యాలో..!



పాలమూరు రెడ్డిసేవా సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం మహబూబ్‌నగర్ పట్టణం బీకేరెడ్డికాలనీలోని రెడ్డి బాలికల వసతిగృహంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సతీమణి లక్ష్మీప్రసన్న, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, మహిళా విభాగం ప్రతినిధులు వేడుకల్లో పాల్గొని బతుకమ్మలకు పూజలు చేశారు. అనంతరం బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు.

- న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ గ్రామీణం

ప్రకృతి పరిరక్షణతోనే మానవ మనుగడ: విమలక్క


బతుకమ్మతో విమలక్క

బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే : ప్రకృతి, స్త్రీలను కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమని ప్రజా గాయకురాలు విమలక్క అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం చెన్నారంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం మహిళలు, చిన్నారులతో కలిసి బహుజన బతుకమ్మ వేశారు. నల్లమల ప్రాంతంలో 2014కు ముందు యురేనియం తవ్వకాలకు నిరసనగా ప్రజా ఉద్యమాలు చేసినట్లు గుర్తుచేశారు. రామగుండాన్ని కాపాడుకోవడం కోసం నిలబడుతున్నట్లు ఈ బహుజన బతుకమ్మ తిరిగి 6వ తేదీన రామగుండం వెళ్తున్నారు. స్త్రీల హక్కులు, మద్యం నిషేధం, కుల నిర్మూలన, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని సూచించారు. బహుజన బతుకమ్మను గ్రామ గ్రామాన జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాశన్నయాదవ్, పరమేశ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాష్.. ఫ్లాష్.. ఫ్లాష్.. అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం.. ఒకరి దుర్మరణం

మరొకరి పరిస్థితి విషమం


మృతదేహాన్ని వాహనంలో ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

జడ్చర్ల, న్యూస్‌టుడే : జడ్చర్ల కొత్త బస్టాండు వద్ద జాతీయ రహదారి-44పై ఫ్లైఓవర్‌పై శనివారం అర్ధరాత్రి తర్వాత 1.30 గంటలకు రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తి(45) అక్కడికక్కడే మృతిచెందగా మరో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. ఉత్తరాది నుంచి ఇక్కడికి పనికి వచ్చిన ఇద్దరు కార్మికులు ఫ్లైఓవర్‌పై నుంచి నడుస్తూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా అందులో ఒకరు మృతిచెందారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గాయపడిన వృద్ధుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉంది. మృతుడు, క్షతగాత్రుడి వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేస్తామని ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

సీఎం స్వగ్రామంలో ఏర్పాట్లు


కొండారెడ్డిపల్లిలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సీఎం ఓఎస్డీ చక్రవర్తిరెడ్డి, సీఎం సోదరుడు కృష్ణారెడ్డి

వంగూరు, న్యూస్‌టుడే : దసరా పండగకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లికి రానుండటంతో జిల్లా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఎం ఓఎస్డీ చక్రవర్తిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ దేవసహాయం, ఏఎస్పీ రామేశ్వర్, ఏఆర్ ఏఎస్పీ భరత్, సీఎం సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి తదితరులు శనివారం కొండారెడ్డిపల్లిని సందర్శించి మాట్లాడారు. సీఎం ప్రారంభించనున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. సౌర ప్రాజెక్టులో భాగంగా సౌర పలకలను రెడ్‌కో, విద్యుత్తుశాఖాధికారులు వేగవంతంగా ఏర్పాటు చేయాలన్నారు. సమయం తక్కువగా ఉన్నందున అధికారులు యుద్ధప్రాతిపాదికన పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం సీఎం నివాసంలో సమావేశమై సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాట్లకు ప్రణాళిక రూపొందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ చిన్నఓబులేశ్, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్సై మహేందర్, పంచాయతీరాజ్ డీఈ చంద్రకళ, ఏఈ మహిపాల్‌నాయక్, ఎంపీడీవో విజయభాస్కర్, ఏవో తనూజరాజ్, నాయకులు వేమారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి వేడుకల్లో సీఎం సతీమణి


ఆలయ అభివృద్ధికి రూ. లక్ష విరాళం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను మూడో రోజు కనుల పండువగా కొనసాగాయి. కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి భార్య గీతారెడ్డి హాజరయ్యారు. ఆలయకమిటీ అధ్యక్షుడు రమేష్‌బాబు, సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన ఆమె ఆలయ అభివృద్ధికి రూ. లక్ష నగదు విరాళం అందజేశారు.

ఆలయ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

వంగూరు, న్యూస్‌టుడే : వచ్చే నెల నవంబర్ 20లోపు ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి అన్నారు. సీఎం స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో రూ. 2కోట్లతో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణ పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు సీఎం స్వయంగా రూ. 2కోట్లు వెచ్చించి ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం చేపట్టారని, అందుకోసమే నాణ్యతగా పనులు చేయించాలని గుత్తేదారుని కోరారు. నవంబర్‌లో విగ్రహ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు ఉంటాయని ఈ కార్యక్రమానికి సీఎం హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సీఎం సోదరి సుమతమ్మ, సీఎం సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి, నాయకులు వేమారెడ్డి, పండిత్‌రావు, కృష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సుజీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

తెరపై ఈనాడు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : శ్రీనివాస: దేవర వెంకటేశ్వర: దక్షిణ, శ్రీరామ: స్వాగ్

పుర ఉద్యోగి మృతికి సంతాపం

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : పురపాలక సంఘ కార్యాలయంలో బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శంకరయ్య శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పుర అధ్యక్షురాలు కరుణశ్రీ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు రూ.పది వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కమిషనర్ ఆదిశేష, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు విజయవర్ధన్ రెడ్డి, పుర సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే : చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీగల్ అండ్ డిఫెన్స్ కౌన్సిల్ ఉత్తరయ్య పేర్కొన్నారు. మండలంలోని అంకూర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. లీగల్ అండ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు, గ్రామీణ రాణి ఎన్జీఓ బాల్య వివాహాలు, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో నవీన తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకని రావాలని సూచించారు. కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిల్ శ్రీదేవి, గ్రామ కార్యదర్శి కవిత, లోక్ అదాలత్ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మెప్మా ఆర్పీల నూతన కార్యవర్గం

వనపర్తి,గ్రామీణం, న్యూస్‌టుడే : తెలంగాణ మెప్మా రిసోర్స్ పర్సన్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా నూతన కమిటీ గౌరవాధ్యక్షుడు పుట్ట ఆంజనేయులు తెలిపారు. అధ్యక్షురాలిగా సరస్వతి, కార్యదర్శిగా లావణ్య, పలు విభాగాల సభ్యులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

ఆదర్శ పాఠశాల సమస్యలు తీర్చండి

పెబ్బేరు, న్యూస్‌టుడే : పట్టణ సమీపంలోని ఆదర్శ పాఠశాలలో నెలకొన్న సమస్యలపై వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డికి శనివారం వనపర్తిలో పాఠశాల ప్రిన్సిపల్ నరేశ్‌కుమార్, అధ్యాపకులు కలిసి వినతి చేశారు. పాఠశాలకు విద్యార్థులు వెళ్లేందుకు సర్వీస్ రోడ్డు (ప్రాంతీయ రహదారి) లేకపోవడంతో వ్యతిరేక దారిలో వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే స్పందించి హైవే అథారిటీ సీఈవోతో మాట్లాడి ప్రాంతీయ రహదారి ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి సన్మానం

అమరచింత, న్యూస్‌టుడే : అమరచింత జిల్లా ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రముఖ కవయిత్రి, హిందీ పాఠశాల సహాయకురాలు బండారు సునీతకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా వనపర్తిలో శనివారం సన్మానించారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం, అహల్య భాయ్ హోల్కర్ త్రిశతాబ్ది జయంతి ఉత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సామాజిక సమరసత వేదిక వారు శాలువ, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో సత్కరించారు. మహబూబ్‌నగర్ జిల్లా విద్యాధికారి రవీందర్, పాఠశాల హెచ్‌ఎం కృష్ణవేణి, ఉపాధ్యాయులు వైద్యు రమ్మ, అనురాధలు అభినందించారు.

ఆలయాభివృద్ధికి విరాళం


అర్చకులకు నగదు అందజేస్తున్న భక్తుడు

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : పట్టణంలోని అంబా భవాని శంకరాలయం అభివృద్ధికి శనివారం వెంకటేశ్ అనే భక్తుడు రూ.51 వేలు విరాళం ఇచ్చారని ఆలయ అర్చకులు సదాశివుడు, ఆనంద్, కోటేశ్వరస్వామి తెలిపారు. ఆలయ శిఖర నిర్మాణానికి నగదు ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

ఆశా వర్కర్లతో అదనపు పనులు తగవు

పాన్‌గల్, న్యూస్‌టుడే : పారితోషికం లేని అదనపు పనులు చేయలేమని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సభ్యులు శనివారం పాన్‌గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆశా వర్కర్లకు సంబంధం లేని పనులు చేయిస్తున్నారని వినతిలో పేర్కొన్నారు. రక్తపోటు, మధుమేహం పరీక్షలు చేయాలని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈనెల 7న వనపర్తిలో ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చండి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: పెద్దమందడి మండలం మనిగిల్లలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి, ఎమ్మెల్యే మేఘారెడ్డికి గ్రామస్థులు వినతిపత్రమిచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో తిరుపతిరెడ్డి, నరసింహారెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్యమందిరం తనిఖీ

పెద్దమందడి, (వనపర్తి న్యూటౌన్), న్యూస్‌టుడే: మండలంలోని మద్దిగట్లలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్ శ్రీనివాసులు శనివారం తనిఖీ చేశారు. వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదు

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : మండలంలోని రంగాపురం గ్రామంలో శనివారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నియోజక వర్గ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాసులు గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర గౌడ్, బూత్ అధ్యక్షుడు గోవిందు నాయుడు, శివ, ప్రవీణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు నగదు వితరణ

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: ఖిల్లాగణపురం కుమ్మరిగేరి ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీకి దసరా ఉత్సవాల నిర్వాహణకు ఆగారం ప్రకాశ్ శనివారం రూ.30 వేలు అందజేశారు. గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు అతన్ని అభినందించారు.

వరుస చోరీలు.. లేవు రికవరీలు

పెబ్బేరు, న్యూస్‌టుడే : పెబ్బేరులో జరుగుతున్న వరుస చోరీలు ప్రజలను కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. పట్టణంతో పాటు గ్రామాల్లో జరుగుతున్న దొంగతనాలు పోలీసులకు సవాలుగా మారుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాదిలో కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. జనవరి నుంచి ఇప్పటి వరకు 37కు పైగా చోరీ కేసులు నమోదు కావడం ఆందోళనకు గురిచేస్తోంది. పట్టణానికి 44వ జాతీయ రహదారి ఆనుకొని ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి చోరీలకు పాల్పడుతున్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి శనివారం సంతలో చోరీలు జరుగుతున్నాయి. ఇవి పోలీసుల దృష్టికి రావడం లేదు.


పెబ్బేరులో ఇటీవల ఏటీఎం చోరీ ఘటనపై ఆరాతీస్తున్న ఎస్పీ రాందాస్ తేజ

● ఈ ఏడాది జనవరిలో అయ్యవారిపల్లిలో రైతు కదిరె బాలస్వామి ఇంట్లో ఏమున్నర తులాల బంగారం, రూ.49 వేలు నగదు చోరీకి గురైంది. మార్చి, ఏప్రిల్‌లో పెబ్బేరు ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం పక్కనే సుమారు 10 దుకాణాల్లో దుండగులు రెండు సార్లు సెట్టర్లను ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. చరవాణులు, విలువైన సామగ్రి, కొంత నగదు ఎత్తుకెళ్లారు.

● ఆగస్టు 12న రంగాపూర్ గ్రామంలో మండలి పద్మ తన దుకాణంలో ఉండగా.. పట్టపగలు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో నుంచి నాలుగున్నర తులాల బంగారం (పుస్తెలతాడు) చోరీ చేశారు.

● గతనెల 22న పెబ్బేరులో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్యాంకుకు సంబంధించిన ఏటీఎంలో గుర్తు తెలియని దుండగులు ఏటీఎంను ధ్వంసం చేసి రూ.18 లక్షలు నగదును దోచుకెళ్లారు. అదే నెల 28న పట్టణంలోని మార్కెట్ యార్డు వెనుక ఎరుకలి లక్ష్మి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు రూ.50 వేలు, 29న పట్టణంలోని రామచంద్ర కాలనీలో నాగవేణమ్మ ఇంట్లో రూ.లక్ష నగదును ఎత్తుకెళ్లారు. ఇలాంటి సంఘటనలు పెబ్బేరు పట్టణంలో అనేకం ఉన్నాయి.

నిఘానేత్రాల నిర్వహణ అంతంతే..

పట్టణంలో 40 నిఘా నేత్రాలు ఉన్నాయి. వీటిలో కనీసం 15 కూడా పని చేయడం లేదు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ వాటి ఏర్పాటుకు ముందుకు రావాలని పోలీసులు చెబుతున్నారు. ఉన్న వాటి నిర్వహణను పట్టించుకోవడం లేదు. పెబ్బేరులో ఇటీవల చోరీ జరిగిన ఏటీఎం వద్ద రెండు సీసీ కెమెరాలు ఉన్నాయి. వాటికి సంబంధించిన హార్డ్‌డిస్క్‌ను సైతం దుండగులు ఎత్తుకెళ్లారు.

విచారణ జరుగుతోంది..

పెబ్బేరులో జరుగుతున్న చోరీలపై విచారణ జరుగుతోంది. దుకాణాల్లో జరిగిన చోరీలపై దొంగలను గుర్తించి రిమాండ్ చేశాం. ఏటీఎంలో జరిగిన చోరీపై అంతర్రాష్ట్ర దొంగల ముఠాపై అనుమానం ఉంది. దీనిపై విచారణ జరుగుతోంది. చోరీలపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- వెంకటేశ్వర్‌రావు, డీఎస్పీ, వనపర్తి

పేదల ఆరోగ్య భద్రతే లక్ష్యం

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు శనివారం రాత్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను ఏఐపీసీ రాష్ట్ర కో - ఆర్డినేటర్ జిల్లెల ఆదిత్య రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవాడి ఆరోగ్య భద్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు వెంకట్రాములు యాదవ్, నాయకులు సహదేవుడు, కృపాకర్ రెడ్డి, రాజశేఖర్ గౌడ్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఏఐపీసీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ జిల్లెల ఆదిత్య రెడ్డి అన్నారు. శనివారం ఖిల్లాగణపురంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంజాయి రమేశ్ ఆధ్వర్యంలో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ దేవన్న, నాయకులు నరేందర్‌గౌడ్, ముజాయిద్, అజీమ్, యాదయ్య పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు కక్షపూరిత చర్య

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి జన్మదినం సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఒక్క రోజు గడవక ముందే తొలగించడం కక్ష పూరిత చర్య అని భారాస జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ అన్నారు. శనివారం మాజీమంత్రి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో వారం రోజులు సమయం ఇచ్చి ఫ్లెక్సీలు తొలగించే వాళ్లమని చెప్పారు. వాటిని తొలగించినంత మాత్రన తమ నాయకుడు చేసిన అభివృద్ధిని నియోజకవర్గ ప్రజలు మరిచిపోరని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు రమేశ్ గౌడ్, మాణిక్యం, నాయకులు వాకిటి శ్రీధర్, తిరుమల్, అశోక్, చిట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేస్తున్నాం : ఎమ్మెల్యే


పొలికెపాడులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : రాష్ట్రంలో మహిళలను మహారాణులుగా చేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. శనివారం రాత్రి మండలంలోని పొలికెపాడు గ్రామంలో మహిళలకు గ్యాస్ సిలిండర్ల రాయితీ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. త్వరలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీ చేస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీవో శంకర్‌నాయక్, ఉమ్మడి మండలాల కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జి సత్యశీలారెడ్డి, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు వెంకటేశ్, రేవల్లి పార్టీ అధ్యక్షుడు పర్వతాలు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మంచినీటి ఇబ్బందులు రానీయొద్దు

వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామీణాల్లో ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా చేసేందుకు ప్రభుత్వం గ్రామ మంచినీటి సహాయకులను సిద్ధం చేస్తోందని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ పంచాయతీ మంచి నీటి సహాయకుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం మహాలక్ష్మి పథకంలోని రాయితీ సిలిండర్లకు సంబంధించిన పత్రాలను మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డు ఛైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, పురపాలక ఛైర్మన్ మహేశ్, మిషన్‌భగీరథ్ ఈఈ మేఘారెడ్డి, ఎంపీడీవో రాఘవ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే లక్ష్యం


సింగిల్‌విండో అధికారులతో మాట్లాడుతున్న డీసీసీబీ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే : రైతుల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని డీసీసీబీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న నూతన భవనాన్ని ఆయన సింగిల్‌విండో అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పరిశీలించారు. రైతుల పాత రుణాలకు, కొత్త రుణాలను పెంచి ఇవ్వాలని, బకాయిలను ఈ నెల 10లోపు సాధ్యమైనంత వరకు వసూలు చేయాలని సూచించారు. రూ.80 లక్షలతో నిర్మించిన సింగిల్‌విండో నూతన భవనం ప్రారంభోత్సవానికి ఈ నెల 10వ తేదీన ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే మేఘారెడ్డిలు ముఖ్య అతిథులుగా రానున్నట్లు డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, స్థానిక సింగిల్‌విండో అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు క్యామ రాజు, డైరెక్టర్ కృష్ణయ్యగౌడ్, సిబ్బంది అనంతరాములు, విజయ్, బాలు తదితరులు పాల్గొన్నారు.


వనపర్తి గాంధీచౌక్‌లో అన్నపూర్ణాదేవిగా.. వనపర్తి వాసవికన్యకా పరమేశ్వరి ఆలయంలో.. కొత్తకోట కన్యాకాపరమేశ్వరి ఆలయంలో.. శాగాపూర్‌లో.. శేరుపల్లిలో.. గోవర్ధనగిరిలో.. ఆత్మకూరు శాకంబరి అలంకరణలో వాసవీమాత

కాశీపురాధీశ్వరీ.. మాతా అన్నపూర్ణేశ్వరీ


వనపర్తిలో దుర్గామాతకు పూజలు చేస్తున్న వనపర్తి సంస్థానాధీశులు రాజాకృష్ణదేవరావు, కుటుంబసభ్యులు

న్యూస్‌టుడే బృందం: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా శనివారం దుర్గాదేవి.. ఆకలి తీర్చే అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కాశీ విశ్వేశ్వరుని ధర్మపత్ని అన్నపూర్ణదేవి అని, పరమేశ్వరునికే పాయసాన్నం భిక్షను అందించిందని, ఆమె అవతార విశిష్టతను అర్చకులు భక్తులకు వివరించారు. మన ఆకలి తీర్చే అమ్మకావడంతో, భక్తులు వివిధ రకాల నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సమస్త జీవరాశులకు ఎప్పుడు పుష్కలంగా ఆహారం అందించాలని భక్తులు కోరుకొన్నారు. పలు చోట్ల దుర్గామాతను వివిధ రూపాల్లో అలంకరించి భక్తితో కొలిచారు. మహిళలు కుంకుమార్చన చేశారు. దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించిన ఆలయాలతో పాటు వాల్మీకినగర్‌లో బొడ్డెమ్మ, బతుకమ్మ నృత్యాల్లో మహిళలు భారీగా పాల్గొన్నారు. వనపర్తి సంస్థానాధీశులు రాజాకృష్ణదేవరావు, ఆయన సతీమణి వల్లరి, కుమారుడు ఆరుద్రదేవరావు దుర్గామాత పూజలు చేశారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి శనివారం రాత్రి పొలికెపాడు, గోపాల్‌పేట, బుద్దారం గ్రామాల్లో ప్రతిష్ఠించిన దుర్గామాతలను దర్శించుకున్నారు. పొలికెపాడు, గోపాల్‌పేటలో మండపాలను నిర్మించేందుకు సహకరిస్తామని చెప్పారు.


వనపర్తి గాంధీచౌక్‌లో దుర్గామాత.. కొత్తకోట గాయత్రీదేవిగా భవాని మాత.. కానాయపల్లిలో.. వనపర్తి మండలం పెద్దగూడెంలో పూజలు.. పెబ్బేరులో నవధాన్యాల అలంకరణలో వాసవీమాత.. చిన్న చౌడేశ్వరీ ఆలయంలో గాయత్రీ దేవి అలంకరణలో దుర్గామాత.. మదనాపురంలో.. గోపాల్‌పేటలో మహాచండీగా

విద్యాలయాల్లో బతుకమ్మ సంబరాలు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: వనపర్తి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలతో పాటు కొన్ని ప్రైవేటు కళాశాలలో బతుకమ్మ వేడుకలు శనివారం ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులు అధ్యాపకులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను చేసి ఆడిపాడారు.

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులు బృందాలుగా ఏర్పడి బతుకమ్మలను సిద్ధం చేసి, కళాశాల ప్రాంగణానికి చేర్చారు. అనంతరం పూజలు చేసి సంప్రదాయ బతుకమ్మ నృత్యాలతో అలరించారు. సాయంత్రం పరమేశ్వరస్వామి చెరువునీటిలో నిమజ్జనం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ భాగ్యవర్ధన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దమందడి, (వనపర్తి న్యూటౌన్), న్యూస్‌టుడే: పెద్దమందడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం బతుకమ్మ సంబరాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ భీమసేన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాన్‌గల్, న్యూస్‌టుడే : పాన్‌గల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం బతుకమ్మలను సమీపంలోని కాల్వలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సుదర్శన్‌రెడ్డి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

అమరచింత, న్యూస్‌టుడే : మండలంలోని పామిరెడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు రంగురంగుల పూలతో బతుకమ్మలను సిద్ధం చేసి పాటలతో బతుకమ్మ ప్రాముఖ్యతను వివరించారు.

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : శ్రీరంగాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులు బతుకమ్మ పండగను జరుపుకొన్నారు. వివిధ రకాల పూలతో బతుకమ్మ అలంకరించారు. పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. విద్యార్థులతో పాటు అధ్యాపకులు సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం గంగమ్మ ఒడికి బతుకమ్మలను తరలించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.


బతుకమ్మ సంబరాల్లో అధ్యాపకులు, విద్యార్థులు


వనపర్తి ప్రభుత్వ బాలికల కళాశాలలో బతుకమ్మ వేడుకలు.. ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో.. పాన్‌గల్‌లో

నిత్యావసరాల ధరలు అదుపు చేయండి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ జబ్బార్

అమరచింత, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించి నిత్యావసర సరకుల ధరలను అదుపు చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. జబ్బార్ పేర్కొన్నారు. శనివారం అమరచింతలోని జీఎస్ భవన్‌లో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్యం, లౌకిక వాదం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో ప్రచార ఉద్యమం నిర్వహిస్తునట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అమరచింత, ఆత్మకూరు మండలాల్లో ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలని కోరారు. సమావేశంలో పుర ఉపాధ్యక్షుడు గోపి, సీపీఎం నాయకులు రమేశ్, అజయ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా సిబ్బందికి ముగిసిన శిక్షణ

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు, అమరచింత మండలాల్లోని గ్రామ పంచాయతీల తాగునీటి సిబ్బందికి ఆత్మకూరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన నాలుగు రోజుల శిక్షణ శనివారం ముగిసింది. చివరి రోజు పైప్‌లైన్ల లీకేజీలు, చేతిపంపుల మరమ్మతుపై శిక్షణ కొనసాగింది. తాగునీటి సరఫరాలో వినియోగిస్తున్న పీవీసీ, హెచ్‌డీపీ పైపులకు మరమ్మతులు చేసే విధానాలను వివరించారు. చేతిపంపుల అత్యవసర మరమ్మతులను అందుబాటులో ఉండే సామగ్రితో పూర్తి చేయాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసిన సిబ్బందికి ధ్రువ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ గ్రిడ్ డీఈ రామసుబ్బారావు, ఏఈ రుకేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


ధ్రువపత్రాలతో శిక్షణ పూర్తి చేసిన సిబ్బంది

క్రైం కార్నర్

కాలువలో పడి వృద్ధుడి మృతి

అమరచింత, న్యూస్‌టుడే : పట్టణ శివారులోని లిఫ్టు కాలువలో అమరచింతకు చెందిన ఎరుకలి బాలస్వామి (64) ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు ఎస్సై బి.సురేశ్ తెలిపారు. రెండు రోజుల కిందట లిఫ్టు వద్ద స్నానం చేసేందుకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు అతని కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం ఓ రైతు కాలువలో మృతదేహం ఉన్నట్లు సమాచారం ఇవ్వడంతో అక్కడికి వెళ్లి కుటుంబ సభ్యులు గుర్తించారని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఉపాధ్యాయుడు..

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : గోపాల్‌పేట మండలం ఏదుల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు సురేంద్రాచారి (52) మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. వనపర్తి పట్టణ ఎస్సై జయన్న తెలిపిన వివరాల మేరకు వనపర్తి కమ్మరివాడకు చెందిన సురేంద్రాచారికి ముగ్గురు కుమార్తెలున్నారు. ఈయన పెద్దకూతురు శ్రీనిధి మూడేళ్ల కిందట మృతి చెందారు. మనస్తాపం చెందిన ఆయన ఈనెల ఒకటో తేదీన కుమార్తె సమాధి వద్దకు వెళ్లి పురుగు మందు తాగారు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. భార్య పుష్పలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోడి పందాల స్థావరంపై దాడి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : మండలంలోని ఆరేపల్లి రైల్వే వంతెన సమీపంలో శనివారం కోడి పందాల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్సై నరేందర్ కథనం ప్రకారం రైల్వే వంతెన సమీపంలోని కృష్ణా నది వద్ద కొందరు కోడి పందేలు ఆడుతున్నట్లు సమాచారం మేరకు ఏఎస్సై బీచుపల్లి, సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. దాడుల్లో 12 మంది వ్యక్తులు పట్టుబడ్డారని చెప్పారు. పది ద్విచక్ర వాహనాలు, 9 చరవాణులు, రూ.11,590 నగదు, 8 కోడి పుంజులు లభ్యమయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకుని 12 మందిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

రుణం ఆశచూపి మోసం

అమరచింత, న్యూస్‌టుడే : మండలంలోని నందిమల్ల ఎక్స్‌రోడ్ గ్రామ పంచాయతీకి చెందిన నరేశ్‌కుమార్ తక్కువ వడ్డీతో రుణం వస్తుందని ఆశ పడి రూ.17,585 యాప్‌లో చెల్లించి మోస పోయినట్లు కేసు నమోదు చేశామని ఎస్సై బి.సురేశ్ తెలిపారు. సైబర్ నేరగాళ్లు రుణం మంజూరు కోసం డబ్బు చెల్లించాలని కోరడంతో పలు దఫాలుగా రూ.17,585లు జులై 15న చెల్లించాడు. రుణం అందకపోవడంతో శనివారం ఠాణాలో ఫిర్యాదు చేసిన మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.